క్లుప్తంగా

బోరు ఏర్పాటు



బోరును తవ్విస్తున్న గ్రామస్తులు

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామ శ్మశాన వాటికలో మండల పరిషత్ నిధులతో మంగళవారం బోరు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ సూర ఆనందరావు, మామిడివలస ఎంపీటీ సభ్యుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో గల అభయ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు, హోమం చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను తిరువీధి నిర్వహించారు.

వరి విత్తనాల పంపిణీ



ఓ.వి.పేటలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు, సిబ్బంది

బూర్జ: మండలంలోని డొంకలపర్త, ఓ.వి.పేట గ్రామ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు



పూజల్లో పాల్గొన్న దంపతులు

నరసన్నపేట: మండలంలోని రెడ్డికిపేట సమీపంలో బసివలస రోడ్డుకు ఆనుకొని పునర్ నిర్మించిన హలహలేశ్వరాలయం ప్రతిష్ట కార్యక్రమాలు రెండో రోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యవరాగ్రహారం గ్రామానికి చెందిన రుత్వికులు శాస్త్రోక్తంగా ప్రతిష్ట ఉత్సవాలు నిర్వహించారు. ఎంపీపీ ఆరంగి మురళి, కమిటీ ప్రతినిధులు శిమ్మ లక్ష్మణరావు దంపతులతోపాటు విగ్రహ దాతలు, దూకులపాడు, గొట్టిపల్లి సర్పంచ్‌లు అల్లు అసిరినాయుడు, అవ్వ రవీంద్రరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జీసీసీ డిపో ప్రారంభం



జీసీసీ డిపోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: నిత్యావసర సరుకులు, జీసీసీ ద్వారా ప్రభుత్వం అందించే సరుకులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక కోర్టు కూడలి సమీపంలో ఉన్న జీసీసీ డీఆర్ డిపోను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులను సేకరించి, తక్కువ ధరలకు గిరిజనులకు అమ్మకాలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ పి.చంద్రకుమారి, మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు, ఉప తహసీల్దార్ బి.వెంకటరమణ, సీఎస్ డీటీ బి.ప్రసాదరావు, గంగు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పట్టుబడిన ట్రాక్టర్లు

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం ఇసుక ర్యాంపుపై తహసీల్దార్ మధుసూదన, ఎస్ఐ హైమావతి మంగళవారం దాడి చేసి రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నారు. ఇదేమిటని అక్కడ ఉన్న ట్రాక్టర్ యజమానులు అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వానికి సంబంధించిన పనులకే ఇసుక తరలిస్తుంటే ట్రాక్టర్లను పట్టుకోడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇదే విషయమై తహసీల్దార్ వద్ద ప్రస్తావించగా మే 31వ తేదీతో ట్రాక్టర్లకు ఉచిత ఇసుక గడువు ముగిసిందన్నారు. ప్రస్తుతం ఇక్కడ నుంచి ఎవరూ ఇసుక తరలించకూడదన్నారు. అనుమతి ఉన్న ప్రదేశాల నుంచి మాత్రమే ఇసుకను తరలించన్నారు.

పోయాం మోసం

- అమలుకు నోచుకోని సంక్షేమ పథకాలు
- ప్రజల నెత్తిన సూపర్ సిక్స్ టోపీ
- ఏడాదిగా అమలు కాని హామీలు
- కూటమిది నయవంచన పాలన



ఎల్.ఎన్.పేట: కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టి ఈ నెల 4వ తేదీకి ఏడాది పాలన పూర్తవుతున్నప్పటికీ ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. 2014–19 మధ్య కాలంలోనూ చంద్రబాబు పాలనలో ఇదే పరిస్థితి. మహిళలకు పసుపు, కుంకుమ పేరుతో మోసం చేశారని గతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ఇచ్చిన మాటకు కట్టుబడి, నిర్ణీత సమయంలోనే పథకాలు అందించారని ఏడాది క్రితం రోజులను గుర్తు చేసుకుంటున్నారు. మహిళల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవని, ఇప్పుడేమో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు.

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు?



ఎన్నికల ముందు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌తో పాటు కూటమి పార్టీల నాయకులు ఎంతో గొప్పగా చెప్పారు. వారి మాటలు నిజమని నమ్మి మోసపోయాం. ఏడాది అవుతున్నా ఉచిత బస్సు ప్రయాణంపై నిర్ణయం తీసుకోలేదు. ఇంకా ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత కూడా లేదు.

– శిమ్మ శ్రీదేవి, మాజీ ఎంపీపీ, గొట్టిపల్లి, ఎల్.ఎన్.పేట

రైతుకు అందని సాయం



ముఖ్యమంత్రిగా చంద్రబాబు వచ్చిన తరువాత రైతులకు పెట్టుబడి కోసం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ డబ్బులు ఏడాదిగా రాలేదు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతీ సీజన్‌లోనూ రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడేవి. అప్పులు చేయాల్సిన పనిలేకుండా పంట పెట్టుబడి కోసం ఉపయోగపడేవి. నేడు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– మామిడి నీలంనాయుడు, రైతు, బొర్రంపేట, ఎల్.ఎన్.పేట



వినియోగంలోనికి రాని ఇండోర్ స్టేడియం



పూర్తికాని లకిమేర రోడ్డు



అభివృద్ధికి నోచుకోని రాజుల చెరువు

అభివృద్ధి శూన్యం

- కార్యకర్తల మేలుకే ఏడాది పాలన
- అభివృద్ధికి నోచుకోని రాజుల చెరువు, ఇండోర్ స్టేడియం

నరసన్నపేట: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నరసన్నపేట నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి శూన్యం. కూటమి కార్యకర్తలకు మేలు చేసే కార్యక్రమాలే తప్ప.. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టలేదు. గత ప్రభుత్వాన్ని విమర్శించడం, హామీలు గుప్పించడమే మిగిలింది. నియోజకవర్గ ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న రాజుల చెరువు అభివృద్ధికి అడుగులు పడలేదు. వాస్తవానికి రాజుల చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు కూటమి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హామీ ఇచ్చారు. దీనికి తగ్గట్టుగా చర్యలు తీసుకోవడం లేదు. క్రీడాకారులకు అవసరమైన ఇండోర్ స్టేడియం కూడా అలాగే ఉంది. గత ప్రభుత్వ కాలంలో ఏ పనులు జరిగాయో వాటితోనే సరిపెట్టారు. శాప్ చైర్మన్ వచ్చి పరిశీలించినా ఎటువంటి ప్రయోజనం లేదు. నరసన్నపేట మెయిన్ రోడ్డు గత ప్రభుత్వ కాలంలో పల్లిపేట కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు అభివృద్ధి జరిగింది. మిగిలిన మెయిన్ రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. దీనికి ప్రతిపాదనలు పంపారే తప్ప.. ఇలాంటి చర్యలు తీసుకోలేదు. కోమర్తి పంచాయతీ లకిమేర రోడ్డు అలాగే ఉంది. ఈ ఏడాది పాలనలో నరసన్నపేట ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆక్రమణలు పెరిగాయి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నరసన్నపేటలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోగా.. ఆక్రమణలు పెరిగాయి. చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుంటున్నారు. రాజుల చెరువు అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మార్కెట్ అభివృద్ధిని పక్కన పెట్టారు.

– కేసీహెచ్‌బీ గుప్త, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట

ఇండోర్ స్టేడియం అభివృద్ధి ఏమైంది



క్రీడాకారులు ఎప్పటి నుంచో ఇండోర్ స్టేడియం కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ కాలంలో దాదాపుగా పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు మరికొన్ని అభివృద్ధి పనులు పేరిట కాలక్షేపం చేస్తున్నారు. ఇండోర్ స్టేడియం పనులను పూర్తిచేసి వినియోగంలోనికి తీసుకురావాలి.

– పాగోటి జానకిరాం, లక్ష్మీనగర్, నరసన్నపేట

అన్ని వర్గాలకూ కూటమి వెన్నుపోటు



పాతపట్నం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి శాంతి, పార్టీ శ్రేణులు

పాతపట్నం: అన్నివర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని, ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నం ఆస్పత్రి కూడలిలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను వైఎస్సార్ విగ్రహం వద్ద నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, నాయకులు బి.నారాయణమూర్తి, యరుకోల వెంకటరమణ, గేదెల సూర్యం, ఎం.తాతయ్య, నేతాజీ, గోకవలస రాము, మాధవపుల్లాయ్, చింతాడ త్రినాథరావు, పనుకు మోహన్, సత్య బిశ్వాల్, తూలుగు ప్రవీణ్, సవిరిగాన కృష్ణారావు, ఎం.తిరుపతిరావు, ధర్మాన కుమార్ రెడ్డి, ఫల్గుణరావు, అప్పలస్వామి, జీవా, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు గాలికి..

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలకు మోసం చేసిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి అన్నారు. ఈ నెల 4వ తేదీన పాతపట్నంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం మెళియాపుట్టిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, పార్టీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, కోఆప్షన్ సభ్యుడు లింగాల సంజీవరావు, సీనియర్ నాయకులు లింగాల సంజీవరావు, అలికాన మాధవరావు, కరణం శశిభూషణరావు, బైపోతు ఉదయ్ కుమార్, పరపటి యోగీశ్వరరావు, సామలో బాబు, సంతోష్ మజ్జి, ఉలాస రవి, తదితరులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

- వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

బూర్జ: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం ఆమదాలవలసలో చేపడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంగళవారం పిలుపునిచ్చారు. మండలంలోని మదనాపురంలో గోవిందరావు ఇంటి ఆవరణలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జల్లు బలరాంనాయుడు, మజ్జి నర్సింగరావు, జి.గోవిందరావు, సైరిగాపు శివ, వియ్యపు కృష్ణ, కొరికాన వెంకటరావు, దేవాడ మహేష్, ఇప్పిలి తిరుపతిరావు, దేవకోటి ఈశ్వరరావు, కొరికాన శ్రీకాంత్, సున్నగొప్పల కొండలరావు, కింజరాపు ఆనందరావు, జి.రాము, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ రామారావు, నాయకులు

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కొత్తూరు: ప్రకృతి సాగు మరింత పెంచాలని కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ సిబ్బందికి అడిషనల్ డీపీఎం ధనుంజయరావు సూచించారు. కొత్తూరులో మాస్టర్ ట్రైనీ సూర్యనారాయణ అధ్యక్షతన మంగళవారం సబ్ డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహించారు.

ప్రతి గ్రామంలోనూ నవధాన్యాల సాగు వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించడంతోపాటు ప్రకృతి సాగును పెంచాలన్నారు. ఎస్ఎఫ్ఏ శివకృష్ణ, సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల యూనిట్ ఇన్‌చార్జీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, లీడ్ ఫార్మర్లు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు



ఆమదాలవలస: అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



సరుబుజ్జిలి: మలేరియా క్రిమి సంహారక మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మలేరియా వ్యాధి నివారణకు ముందస్తుగా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస వద్ద గల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మలేరియా వ్యాధి నివారణకు సంబంధించిన క్రిమిసంహారక మందును తరగతి గదుల్లో పిచికారీ చేశారు. గిరిజన గ్రామం వెన్నెలవలసలోని ప్రతీ ఇంట్లో స్ప్రే చేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.సూర్యం, సీహెచ్ఓ మోహనరావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ రుక్మిణి, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

ఆమదాలవలస: పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా వ్యాధిని నివారించవచ్చని అక్కులపేట పీహెచ్‌సీ వైద్యురాలు వసంత అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటిచుట్టూ చెత్తాచెదారాలు, మురుగు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఈఓ జనార్దనరావు, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తరలిరావాలి

పొందూరు: ఈ నెల 4వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఆమదాలవలసలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రైతులను, విద్యార్థులను, మహిళలను, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు.

అక్రమ కేసులు పెట్టడం తగదు



సవరచీపురుపల్లిలో మాట్లాడుతున్న గిరిజనులు

మెళియాపుట్టి: గిరిజనులపై ఎక్సైజ్‌శాఖ అధికారులు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టడం తగదని పలు గిరిజన సంఘం నాయకులు అన్నారు. మంగళవారం సవర చీపురుపల్లి గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది దాడులు చేసి నాటుసారా తయారు చేస్తున్నారనే అభియోగాలతో అరెస్టులు చేయడం బాధాకరమన్నారు. వలస వెళ్లిన యువకులపై కూడా కేసులు నమోదు చేస్తున్నారని, ఇలా చేయడం వల్ల కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా అవస్థలు పడుతున్నారన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల వైఖరి మార్చుకోవాలని, లేదంటే జాతీయ గిరిజన హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సవర కుమార్, సవర శ్రీరాములు, సవర అప్పారావు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలతో ఆదాయం



మాట్లాడుతున్న హరికుమార్

నరసన్నపేట: ఉద్యానవన పంటలు పండించడం ద్వారా రైతులు అధిక ఆదాయాలన్ని పొందవచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త హరికుమార్ అన్నారు. మండలంలోని గోపాలపెంటలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. జీడిమామిడి, కొబ్బరి పంటలతో మంచి ఆదాయం వస్తుందన్నారు. వరితోపాటు ఇతర పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. వరి పరిశోధనా శాస్త్రవేత్త కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. వరికి ఆశించే చీడపీడలు, వాటి యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. శాస్త్రవేత్త అనంత పాల్ పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవత మహోత్సవాలు



దేవర, అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామంలో గల జడ్డెమ్మ గ్రామ దేవత మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామస్తులందరూ జడ్డెమ్మ అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామంలోకి దేవర, అమ్మవారి ప్రతిమను తీసుకువచ్చి ఊరేగించారు. ఊరేగింపులో శివపార్వతుల నృత్యం ఆకట్టుకుంది. గ్రామంలోని వీధులన్నీ విద్యుత్ కాంతులతో విరజిల్లుతున్నాయి. సీఐ వి.రామారావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి



చింతాడ రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గ కేంద్రం ఆమదాలవలసలో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 గంటలకు ఆమదాలవలసలోని కంచ్రపేట జంక్షన్ వద్ద గల గాంధీ విగ్రహం వద్దకు పార్టీ శ్రేణులంతా చేరుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు పొడిచే వెన్నుపోటును ప్రజలకు తెలియజేద్దామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వెన్నుపోటు చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు సీఎం చంద్రబాబు వెన్నుపోటు పొడిచిన తీరుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు వెన్నుపోటు దినం కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నామని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు నరసన్నపేటలోని లక్ష్మీటాకీస్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలని కోరారు. అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. నాలుగు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, కనుసు సీతారాం, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు, నేతింటి రాజేశ్వరరావు, ఆర్.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న సర్పంచ్, ఉప సర్పంచ్

నరసన్నపేట: స్థానిక పంచాయతీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా మౌలిక వసుతులు కల్పిస్తున్నామని, చట్టానికి లోబడి పని చేస్తున్నామని నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు కృష్ణ ప్రసాద్, బోయిన సతీష్, ఆర్.శ్రీధర్, బి.ఎల్.శర్మ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో వద్ద మాట్లాడారు. పంచాయతీ పాలకవర్గంపై కొందరు సోషల్ మీడియాలో నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు, ఇలా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని వీధుల్లో సంకేతిక కారణాలతో కుళాయిలు పనిచేయకపోతే పంచాయతీ కార్యవర్గంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్ప.. ఇలా ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. 15 రోజులుగా మారుతీనగర్‌లోని వీధులకు నీరు రావడం లేదని తప్పుడు ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కుళాయిలు రాకపోయినా, చెత్త తీయకపోయినా తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సిబ్బంది వచ్చి చర్యలు తీసుకుంటారన్నారు. ముద్దాడ అప్పలనాయుడు ఉన్నారు.